సాక్షి శ్రీసత్యసాయి జిల్లా

బుధవారం ၊ 25 ၊ జనవరి ၊ 2023



చీనీ టన్ను రూ.28 వేలు

అనంతపురం సమీపంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డులో మంగళవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.28 వేలు పలికాయి.



టమాట కిలో రూ.20

కక్కలపల్లి మండీలో మంగళవారం కిలో టమాట ధర గరిష్టంగా రూ.20, కనిష్టం రూ.5, సరాసరి రూ.10 పలికింది. మార్కెట్‌కు 780 టన్నులు అమ్మకానికి వచ్చాయి.



జిల్లా పరిధిలో మంగళవారం చలి వాతావరణం కొనసాగింది. పగటి ఉష్ణోగ్రతలు స్థిరంగానూ, రాత్రి ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరిగాయి. ఆగ్నేయ దిశగా గాలులు గంటకు 4 నుంచి 6 కిలో మీటర్ల వేగంతో వీచాయి.

న్యూస్‌రీల్

మహిళా పోలీసు మున్నికి బెస్ట్ ఎలక్టోరల్ అవార్డు



మున్ని

పెనుకొండ రూరల్: పెనుకొండ నగర పంచాయతీలోని వెంకటరెడ్డిపల్లి 6వ సచివాలయంలో విధులు నిర్వర్తిస్తున్న మహిళా పోలీసు మున్నికి బెస్ట్ ఎలక్టోరల్ రాష్ట్ర స్థాయి అవార్డుకు ఎంపికై నట్లు కమిషనర్ వంశీకృష్ణ ఓ ప్రకటనలో తెలిపారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు విధులను ప్రతిభావంతంగా నిర్వర్తించడంతో ఆమెను రాష్ట్రస్థాయి అవార్డు వరించినట్లు పేర్కొన్నారు. జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం విజయవాడలో జరిగే కార్యక్రమంలో మున్నికి అవార్డు ప్రదానం చేస్తారని తెలిపారు.

సస్యరక్షణ చర్యలతో అధిక దిగుబడులు

- డీఏఓ సుబ్బారావ్, అగ్రీ అడ్వైజరీ బోర్డు చైర్మన్ రమణారెడ్డి



'పొలం బడి'లో రైతులకు సూచనలిస్తున్న అధికారులు

పుట్టపర్తి టౌన్: పంటలో సస్యరక్షణ చర్యలతో రైతులు అధిక దిగుబడులు సాధించవచ్చని జిల్లా వ్యవసాయ అధికారి (డీఏఓ) సుబ్బారావ్, జిల్లా అగ్రి అడ్వైజరీ బోర్డు చైర్మన్ అవుటాల రమణారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం పుట్టపర్తి మున్సిపాలిటీ పరిధి బీడుపల్లి గ్రామంలో రైతు ఈశ్వర రెడ్డి పొలంలో 'పొలం బడి' కార్యక్రమం నిర్వహించారు. వేరుశనగ, మొక్కజొన్న, వరి పంటలను పరిశీలించి రైతులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధికారుల సూచనల మేరకు మందులు పిచికారీ చేసుకోవాలని సూచించారు. రైతు భరోసా కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్రామాల్లోనే రైతులకు విత్తనం దగ్గర నుంచి కోత వరకు ప్రభుత్వం అన్ని రకాల సేవలనూ అందుబాటులోకి తీసుకొచ్చిందని తెలిపారు. పంట సాగులో ఏ సమస్యలున్నా అధికారులకు తెలియజేయాలని వారు కోరారు. కార్యక్రమంలో అధికారులు సనాపుల్లా, శశిధర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

5న జాతీయ ఉపకార వేతన పరీక్ష

కొత్తచెరువు: జాతీయ ఉపకార వేతనానికి దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఫిబ్రవరి 5న పరీక్ష నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జ్ డీఈఓ మీనాక్షి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ పరీక్ష ఉంటుందన్నారు. హాల్‌టికెట్లు www.bse.ap.gov.inలో అందుబాటులో ఉన్నాయని సూచించారు. ఉపాధ్యాయులు యు-డీఐఈఎస్ కోడ్ ద్వారా లాగిన్ అయి విద్యార్థులకు హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసి ఇవ్వాలని ఆదేశించారు.

ఎస్కేయూకు అదనపు గ్రాంట్ మంజూరు

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయానికి రూ.42.85 కోట్ల అదనపు బ్లాక్ గ్రాంట్ మంజూరైంది. ఈ మేరకు ఉన్నత విద్య ప్రిన్సిపల్ సెక్రెటరీ జె.శ్యామలారావు జీఓ 14ను మంగళవారం జారీ చేశారు. 2022-23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మొత్తం రూ.65.87 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో కేటాయించింది. ఉద్యోగులకు జీతాలు, రిటైర్డ్ ఉద్యోగులకు పెన్షన్ ఇవ్వడానికి మరో రూ.42.85 కోట్లు అవసరం అని ఎస్కేయూ వీసీ ప్రొఫెసర్ మాచిరెడ్డి రామకృష్ణారెడ్డి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. దీంతో మార్చి నెల వరకు జీతాలు వర్తించేలా అదనపు గ్రాంట్ మంజూరైంది. ఈ నేపథ్యంలో 2022-23 ఆర్థిక సంవత్సరానికి రూ.108.72 కోట్ల బ్లాక్‌గ్రాంట్ దక్కింది.

న్యాయం గెలిచింది!



ముద్దాయిలు

డి. గంగాప్రసాద్, కపాడం నాగరాజు

కపాడం గంగాధర్, సూర్యనారాయణ, డి.పెద్దన్న

హతుడు చెన్నారెడ్డి (ఫైల్)

- వైఎస్సార్‌సీపీ నేత చెన్నారెడ్డి హత్య కేసులో సంచలన తీర్పు
- ఆరుగురు టీడీపీ నాయకులకు జీవిత ఖైదు
- గ్రామంలో ఆధిపత్యం కోసం పాశవికంగా చెన్నారెడ్డిని హతమార్చిన దుండగులు
- సుదీర్ఘ విచారణ అనంతరం నేరం నిరూపణ
- తీర్పుపై హర్షం వ్యక్తం చేసిన బాధిత కుటుంబం

ధర్మవరం: స్వార్థ ప్రయోజనాలతో టీడీపీ నేతలు సాగించిన రాక్షస క్రీడకు బలైన వైఎస్సార్‌సీపీ నేత ఎర్రగుంట చెన్నారెడ్డి హత్య కేసులో నిందితులపై అభియోగాలు రుజువయ్యాయి. గ్రామంలో ఆధిపత్యం కోసం అమాయకుడైన వైఎస్సార్‌సీపీ నాయకుడు చెన్నారెడ్డిని అత్యంత దారుణంగా హత మార్చిన ఉదంతంలో టీడీపీ నాయకులు ఆరుగురికి జీవితఖైదు విధిస్తూ అనంతపురం జిల్లా జడ్జి శ్రీనివాస్ మంగళవారం సంచలన తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ తరఫున హరినాథ్ రెడ్డి వాదనలు వినిపించారు.

పాశవికంగా హతమార్చారు..

ధర్మవరం మండల పరిధిలోని బడన్నపల్లిలో 2017 డిసెంబర్ 6న గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు ఎర్రగుంట చెన్నారెడ్డిని ప్రత్యర్థులైన టీడీపీ నాయకులు కపాడం గంగాధర్, కపాడం సూర్యనారాయణ, దాసరి పెద్దన్న, దాసరి శివయ్య, దాసరి గంగాప్రసాద్, కపాడం నాగరాజు అత్యంత కిరాతకంగా వేటకొడవళ్లతో నరికి చంపారు. గ్రామం నుంచి ఉదయం 9 గంటలకు స్కూటర్‌లో పంటకు యూరియా చల్లేందుకు వెళ్తున్న చెన్నారెడ్డిని తోట సమీపంలో అటకాయించి టీడీపీ నాయకులు విచక్షణారహితంగా నరికి చంపారు. తోట సమీపంలో ఉన్న మృతుని భార్య భాగ్యమ్మ, అక్క శాంతమ్మ, రాఘవ రెడ్డి జరుగుతున్న దారుణాన్ని చూసి చంపొద్దు అంటూ వేడుకున్నా కనికరించకుండా హత్య చేసి వెళ్లిపోయారు. అప్పట్లో భాగ్యమ్మ ఫిర్యాదుతో ధర్మవరం రూరల్ పోలీస్‌స్టేషన్‌లో సీఆర్ నంబర్ 118/2017తో ఎఫ్ఐఆర్ నమోదు చేసి నిందితులపై 302 రెడ్‌విత్ 34 ఐపీసీ సెక్షన్ల కింద పోలీసులు కేసు నమోదు చేశారు. అప్పటి సీఐ శివరాముడు హత్య కేసు దర్యాప్తు చేపట్టి చార్జిషీట్ దాఖలు చేశారు.

బాధిత కుటుంబానికి జగన్ పరామర్శ...

టీడీపీ నాయకుల చేతిలో దారుణ హత్యకు గురైన చెన్నారెడ్డి కుటుంబాన్ని 2019 జనవరి9న అప్పట్లో ప్రతిపక్ష నేతగా ఉన్న వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పరామర్శించారు. న్యాయం చేస్తామని భరోసానిచ్చారు. అన్ని విధాలుగా అండగా ఉండాలని కేతిరెడ్డి వెంకటరామిరెడ్డికి సూచించారు.

సూరి మద్దతుతో రెచ్చిపోయారు..!

ఎర్రగుంట చెన్నారెడ్డి బడన్నపల్లిలో వైఎస్సార్‌సీపీ ముఖ్యనాయకుడు. పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనేవాడు. ప్రజల మద్దతు పుష్కలంగా ఉండేది. ఇదే గ్రామంలో కపాడం సూర్యనారాయణ, కపాడం గంగాధర్ టీడీపీలో ఉండేవారు. పార్టీల పరంగా చెన్నారెడ్డి అంటే వీరికి పొసగేది కాదు. గ్రామంలో రామాలయ ధ్వజ స్తంభ ప్రతిష్టాపన విషయంలో భేదాభిప్రాయాలు రావడంతో ఇరువురి మధ్య విభేదాలు చోటు చేసుకున్నాయి. దీనికి తోడు 2018 జనవరిలో వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ప్రస్తుత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్ర ధర్మవరం మండలం చేరుతుండటంతో గ్రామంలో పార్టీ ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడంతో పాటు పార్టీ కార్యక్రమాలను చెన్నారెడ్డి పెద్ద ఎత్తున చేపట్టారు. గ్రామం మొత్తం చెన్నారెడ్డికే మద్దతు పలుకుతూ ఉండటంతో టీడీపీ నాయకులు జీర్ణించుకోలేకపోయారు. ఈ క్రమంలోనే అప్పటి ఎమ్మెల్యే సూరి టీడీపీలో హార్డ్‌కోర్, సాఫ్ట్ కోర్ కమిటీలను ఏర్పాటు చేసి 'వైఎస్సార్‌సీపీ నాయకులను కొట్టండి, చంపండి' అంటూ ఆదేశాలు జారీ చేసి మద్దతు తెలపడంతో టీడీపీ నాయకులు రెచ్చిపోయారు. చెన్నారెడ్డిని హతమార్చేందుకు కపాడం గంగాధర్, సూర్యనారాయణ తమ సమీప బంధువులతో కలసి పక్కా స్కెచ్ వేసి వేటకొడవళ్లతో కిరాతకంగా హతమార్చారు. వరదాపురం సూరి భరోసాతోనే టీడీపీ నాయకులు హత్యకు తెగబడ్డారని మృతుని బంధువులు ఆరోపించారు. టీడీపీ అధికారం కోల్పోయి రెండు నెలలు కూడా గడవ కుండానే సూరి పార్టీ మారి టీడీపీ శ్రేణులకే షాక్ ఇచ్చాడు.

సుదీర్ఘ విచారణ.. సంచలన తీర్పు..

చెన్నారెడ్డి హత్య కేసుపై అనంతపురం న్యాయస్థానం సుదీర్ఘ విచారణ జరిపింది. హత్యకు సంబంధించి సాక్షులను, ఆధారాలను పరిశీలించిన న్యాయస్థానం నిందితులైన టీడీపీ నాయకులు కపాడం గంగాధర్, కపాడం సూర్యనారాయణ, దాసరిపెద్దన్న, దాసరి శివయ్య, దాసరి గంగాప్రసాద్, కపాడం నాగరాజుకు జీవితకాల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.5 వేల జరిమానా విధిస్తూ జడ్జి శ్రీనివాస్ తీర్పునిచ్చారు. దీంతో చెన్నారెడ్డి బంధువులు మంగళవారం గ్రామంలో సంబరాలు చేసుకున్నారు. న్యాయం గెలిచిందని సంతోషం వ్యక్తం చేశారు.



తల్లి భాగ్యమ్మకు స్వీట్ తినిపిస్తున్న కుమార్తె

పోరాటం ఫలించింది



నా భర్త ఏ తప్పు చేయకున్నా టీడీపీ నాయకులు దారుణంగా హత్య చేశారు. భర్త మరణంతో నేను, నా ఇద్దరు కూతుళ్లు దిక్కులేని వారమయ్యాం. న్యాయస్థానంలో మా పోరాటం ఫలించింది. ఈ తీర్పు ద్వారా ఇకపై ఎవరూ ఇలాంటి చర్యలకు పాల్పడరని ఆశిస్తున్నా.

– ఎర్రగుంట భాగ్యమ్మ, చెన్నారెడ్డి భార్య, బడన్నపల్లి

దారుణంగా హత్య చేశారు



మా అన్నను టీడీపీ నాయకులు వేట కొడవళ్లతో దారుణంగా హత్య చేశారు. రాజకీయ కక్షతో గ్రామంలో ఆధిపత్యం కోసం ఇంతకు బరితెగించారు. మేం చేసిన పోరాటం వృథా కాలేదు. నిందితులకు జీవిత ఖైదు విధిస్తూ న్యాయస్థానం ఇచ్చిన తీర్పు హర్షణీయం.

– ఎర్రగుంట కేశవరెడ్డి, చెన్నారెడ్డి సోదరుడు

పరుగుతో సమానత్వానికి నాంది

- ఆర్డీటీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అన్నే ఫెర్రర్



అల్ట్రా మారథాన్ రన్‌ను జెండా ఊపి ప్రారంభిస్తున్న అన్నే ఫెర్రర్, మాంఛో ఫెర్రర్, విశాల ఫెర్రర్

అనంతపురం సప్తగిరి సర్కిల్: పరుగు పోటీలతో సమానత్వానికి నాంది పలుకుతున్నామని ఆర్డీటీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అన్నే ఫెర్రర్ అన్నారు. మంగళవారం సాయంత్రం అనంతపురం ఆర్డీటీ ప్రధాన కార్యాలయం నుంచి ఎనిమిదో అల్ట్రా మారథాన్ రన్ నిర్వహించారు. ముఖ్య అతిథులు అన్నే ఫెర్రర్‌తో పాటు ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంఛో ఫెర్రర్, ఉమెన్ ఎంపవర్‌మెంట్ డైరెక్టర్ విశాల ఫెర్రర్, స్పెయిన్‌కు చెందిన జువాన్ మాన్యువల్ ప్రారంభించిన ఈ పరుగులో స్పెయిన్, జర్మనీ, ఇండియా క్రీడాకారులు పాల్గొన్నారు. మొత్తం నాలుగు బృందాలుగా విడిపోయి.. ఒక్కో బృందం 42 కిలోమీటర్ల చొప్పున మొత్తం 170 కిలోమీటర్ల మేర ఈ పరుగు కొనసాగుతుంది. కలెక్టరేట్, చెరువుకట్ట మీదుగా బుక్కరాయ సముద్రం, రెడ్డిపల్లి మీదుగా బుధవారం సాయంత్రం బత్తలపల్లి ఆర్డీటీ ఆస్పత్రికి పరుగు చేరుకుంటుంది. అక్కడ ఆర్డీటీ వ్యవస్థాపకుడు ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ విగ్రహానికి నివాళులర్పిస్తారు. ఈ రన్ ద్వారా ఆర్డీటీ సంస్థ తన కార్యకలాపాలు నిర్వహిస్తున్న ఆంధ్ర, తెలంగాణ ప్రాంతాలకు చెందిన కుటుంబాలకు అండగా నిలుస్తోంది. కార్యక్రమంలో ఆర్డీటీ చైర్మన్ తిప్పేస్వామి, డైరెక్టర్లు దశరథ్, నిర్మల్‌కుమార్, సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరం కేసులో ఇద్దరి అరెస్ట్

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: అనంతపురంలోని ఓ బార్ యజమాని బ్యాంకు ఖాతా నుంచి కోటి రూపాయలు అపహరించిన సైబర్ నేరం కేసులో ఇద్దరు నిందితులను వన్ టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితులు ఢిల్లీకి చెందిన రాజూ చౌహాన్, హుమ్యాన్స్‌ను మంగళవారం రాత్రి మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపరచగా.. ఫిబ్రవరి ఆరో తేదీ వరకు రిమాండ్ విధించారు. ఇంకా ఈ కేసులో కీలక సూత్రధారిని అరెస్ట్ చేయాల్సి ఉందని సీఐ రవిశంకర్ రెడ్డి తెలిపారు. త్వరలో ఆయనను కూడా పట్టుకుంటామన్నారు.

బిడ్డకు పోషణ.. తల్లికి రక్షణ

- ఉమ్మడి జిల్లాలో 1.41 లక్షల మంది చిన్నారులకు లబ్ధి
- పోషకాహారం సరఫరాపై ప్రతినిత్యం పర్యవేక్షణ
- సంపూర్ణ పోషణ కింద లబ్ధి పొందుతున్న గర్భిణులు 30 వేల మందిపైనే
- కోవిడ్‌తో తల్లిదండ్రులను కోల్పోయిన 61 మంది చిన్నారులకు రూ.10 లక్షల చొప్పున సాయం



అనంతపురం జిల్లాలో ఐసీడీఎస్ ప్రాజెక్టులు	10
బాలామృతం తీసుకుంటున్న చిన్నారులు	81,322
సంపూర్ణ పోషణ లబ్ధి పొందుతున్న చిన్నారులు	41,238
సంపూర్ణ పోషణ లబ్ధి పొందుతున్న గర్భిణులు	17,594
సంపూర్ణ పోషణ లబ్ధి పొందుతున్న బాలింతలు	16,681
శ్రీసత్యసాయి జిల్లాలో ఐసీడీఎస్ ప్రాజెక్టులు	7
బాలామృతం తీసుకుంటున్న చిన్నారులు	60,285
సంపూర్ణ పోషణ లబ్ధి పొందుతున్న చిన్నారులు	39,511
సంపూర్ణ పోషణ లబ్ధి పొందుతున్న గర్భిణులు	12,730
సంపూర్ణ పోషణ లబ్ధి పొందుతున్న బాలింతలు	12,861

సాక్షి ప్రతినిధి, అనంతపురం: ఉమ్మడి అనంతపురం జిల్లాలో మూడేళ్లలోపు చిన్నారులకు ఇచ్చే బాలామృతం పుష్కలంగా అందుతోంది. 2019కు ముందు పరిస్థితి వేరు. ఇప్పటి పరిస్థితులు వేరు. అప్పట్లో అరకొరగా అందించడంతో పౌష్టికాహార లోపంతో బాధపడే చిన్నారుల సంఖ్య ఎక్కువగా ఉండేది. ప్రస్తుతం తగినంత పౌష్టికాహారం అందిస్తుండటంతో ఆ సమస్య గణనీయంగా తగ్గింది. అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లో ఇప్పుడు 1.40 లక్షల మంది చిన్నారులకు బాలామృతం క్రమం తప్పకుండా అందుతోంది. అత్యధిక పోషక విలువలున్న ఈ బాలామృతం సరఫరా పర్యవేక్షణ అత్యంత పకడ్బందీగా చేస్తున్నారు.

బాలింతలు గర్భిణులకు సంపూర్ణ పోషణ..

అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లో కనీవినీ ఎరుగని రీతిలో గర్భిణులు, బాలింతలకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ ద్వారా పౌష్టికాహారం అందిస్తున్నారు. రాగిపిండి, బెల్లం, వేరుశనగ చిక్కీ, ఎండు ఖర్జూరం, జొన్న పిండి, అటుకులతో కూడిన ఆహారం ఇన్నారు. అనంతపురం జిల్లాలో 17,594 మంది గర్భిణులు, 11681 మంది బాలింతలు లబ్ధి పొందుతున్నారు. శ్రీసత్యసాయి జిల్లాలో 12,730 మంది గర్భిణులు, 12,861 మంది బాలింతలకు సంపూర్ణ పోషణ అందుతోంది.

తల్లీబిడ్డల క్షేమమే లక్ష్యం

ఏ ప్రభుత్వమూ చేపట్టని విధంగా జగనన్న ప్రభుత్వం చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు సంపూర్ణ పోషణ అందిస్తోంది. అప్పట్లో ఈ పనిని ప్రభుత్వాలు బరువుగా భావించేవి. కానీ మా ప్రభుత్వం బాధ్యతగా భావించి చేస్తోంది. మూడున్నరేళ్ల కాలంలో మాతా శిశు రక్షణకు తీసుకున్న చర్యలు సత్ఫలితాలిచ్చాయి.

– ఉషశ్రీచరణ్, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి

కోవిడ్‌తో నిరాశ్రయులైన చిన్నారులకు అండగా..

కోవిడ్ బారినపడి తల్లిదండ్రులను కోల్పోయిన చిన్నారులను రాష్ట్ర ప్రభుత్వం అక్కున చేర్చుకుంది. అనంతపురం జిల్లాలో 40 మంది చిన్నారులకు, శ్రీసత్యసాయి జిల్లాలో 21 మంది చిన్నారులను గుర్తించి రూ.10 లక్షల చొప్పున బ్యాంకులో డిపాజిట్ చేశారు. అంతేగాకుండా కోవిడ్‌తో తల్లి లేదా తండ్రిని కోల్పోయిన చిన్నారుల్లో అనంతపురం జిల్లాలో 671 మందిని గుర్తించి నెలకు రూ.500 చొప్పున ఐసీపీఎస్ ద్వారా పెన్షన్ ఇస్తున్నారు. శ్రీసత్యసాయి జిల్లాలో 387 మంది చిన్నారులకు ఈ పథకం ద్వారా లబ్ధి జరుగుతోంది.

బాలికలను ఉన్నతంగా చదివించాలి

- కలెక్టర్ బసంత్‌కుమార్



విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందిస్తున్న కలెక్టర్ బసంత్‌కుమార్

పుట్టపర్తి టౌన్: బాలికలను ఉన్నతంగా చదివించాలని కలెక్టర్ బసంత్‌కుమార్ పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్ స్పందన హాల్లో వైద్య ఆరోగ్యశాఖ, ఐసీడీఎస్ శాఖల ఆధ్వర్యంలో జాతీయ బాలిక దినోత్సవ ముగింపు కార్యక్రమం నిర్వహించారు. జాతీయ బాలిక వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన వ్యాసరచన, చిత్రలేఖనం, వక్తృత్వ పోటీల్లో ప్రతిభ కనబరచిన బాలికలకు కలెక్టర్ బసంత్ కుమార్ ప్రశంసా పత్రాలు, నగదు బహుమతులు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బాలురతో బాలురతో పాటు బాలికలు అన్ని రంగాల్లో రాణించాలని పిలుపునిచ్చారు. ఈ దిశగా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని సూచించారు. లింగ వివక్షత, గర్భస్థ లింగ నిర్ధారణ పద్ధతులను ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ డీఈఓ మీనాక్షి, డీఎంహెచ్‌ఓ కృష్ణారెడ్డి, ఐసీడీఎస్ పీడీ లక్ష్మీకుమారి, డీఐఓ డాక్టర్ కృష్ణయ్య, డీపీఎం కుళ్లాయప్పానాయక్, హెల్త్ ఎడ్యుకేటర్ రామలక్ష్మి, ఫక్రోద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన పౌరసేవలు అందించాలి..

నల్లచెరువు: గ్రామ సచివాలయాల ద్వారా ప్రజలకు మెరుగైన పౌరసేవలను అందించాలని కలెక్టర్ బసంత్‌కుమార్ అన్నారు. మండల పరిధిలోని ఎం. అగ్రహారం, ఓరువాయి, తలమర్లవాండ్లపల్లి గ్రామ సచివాలయాలను మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు, రిజిస్టర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ యూనిఫాం ధరించకుండా విధులకు హాజరైతే జీతాలను నిలిపివేస్తామని హెచ్చరించారు. అర్హులైన లబ్ధిదారుల వివరాలను సచివాలయాల్లో ప్రదర్శించాలని ఆదేశించారు. వలంటీర్లు కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా స్వచ్ఛంద సేవకులుగా పనిచేస్తున్నారని ప్రశంసించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారావు, ఏడీఏ సత్యనారాయణ, ఎంపీడీఓ శకుంతల, ఏఓ భారతి తదితరులు పాల్గొన్నారు.

'ఈ-క్రాప్' పక్కాగా చేపట్టాలి

తనకల్లు/ఎన్పీ కుంట: ఈ-క్రాప్ బుకింగ్ పక్కాగా చేపట్టాలని కలెక్టర్ బసంత్‌కుమార్ అన్నారు. తనకల్లు మండల పరిధి పెద్ద కడపలవాండ్లపల్లి సమీపంలో షాహీనా అనే మహిళా రైతు సాగు చేసిన టమాట పంటను, ఎన్పీ కుంట మండలం ఎదురుదోన పంచాయతీ దాసరవాండ్లపల్లిలో రైతు ఎం.వెంకటరమణారెడ్డి సాగు చేసిన టమాట పంటను కలెక్టర్ పరిశీలించారు. రైతులు కచ్చితంగా తాము సాగుచేసిన పంటల వివరాలను ఈ-క్రాప్ బుకింగ్ చేయించుకోవాలని తెలిపారు. నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని సిబ్బందిని ఆదేశించారు.

గణతంత్ర వేడుకలకు వేళాయె..





పోలీసు జాగిలాలకు శిక్షణ ఇస్తున్న పోలీసులు



ఏఆర్ సిబ్బంది కవాతు ప్రదర్శన



సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొననున్న విద్యార్థులు

పుట్టపర్తి అర్బన్: జిల్లా కేంద్రం పుట్టపర్తిలో మొదటి సారిగా నిర్వహిస్తున్న గణతంత్ర వేడుకలకు శిరసాని హిల్స్‌లోని పోలీసు పరేడ్ గ్రౌండ్ ముస్తాబైంది. పోలీసు, రెవెన్యూ శాఖల ఆధ్వర్యంలో పరేడ్ గ్రౌండ్‌ను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. జాతీయ భావం ఉట్టిపడే విధంగా గ్రౌండ్ నలువైపులా జాతీయ జెండాల చిత్రాలు, వివిధ రకాల జెండాలు రెపరెపలాడుతున్నాయి. పోలీసు జాగిలాలు ప్రదర్శనకు సిద్ధమయ్యాయి. కలెక్టర్ బసంత్‌కుమార్, ఎస్పీ రాహుల్ దేవ్ సింగ్ ఆధ్వర్యంలో వేడుకలను పెద్ద ఎత్తున నిర్వహించనున్నారు. పరేడ్ మైదానంలో మంగళవారం ఏఆర్ పోలీస్ సిబ్బంది ఆధ్వర్యంలో మార్చ్‌ఫాస్టు, జిల్లా నలుమూలల నుంచి విచ్చేసిన పలు విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులు రిహార్సల్స్ నిర్వహించారు. వివిధ ప్రభుత్వశాఖల ఆధ్వర్యంలో స్టాల్స్‌ను సిద్ధం ఏర్పాటు చేశారు.

బాలయ్యా.. మేం గుర్తున్నామయ్యా!

- 26న మరోసారి ఎమ్మెల్యే బాలకృష్ణ రాక
- శుభకార్యాలకు తప్ప ఎమ్మెల్యేకు గుర్తుకురాని 'పురం'
- ప్రజాప్రతినిధినన్న విషయం మరిచిన బాలయ్య
- కరోనా కష్టకాలంలోనూ కన్నెత్తి చూడని వైనం
- ఓటేసిన ప్రజలు, పార్టీ నాయకుల్లో నిరుత్సాహం



హిందూపురం: నందమూరి బాలకృష్ణను ఎమ్మెల్యేగా హిందూపురం గుర్తింపునిచ్చింది. అయితే ఆ గుర్తింపును ఆయన నిలబెట్టుకోలేకపోయారు. చుట్టపు చూపుగా హిందూపురానికి వచ్చి వెళ్లడం మినహా... ఏనాడూ తాను ఈ నియోజకవర్గ ఎమ్మెల్యేననే విషయాన్ని ఆయన గుర్తించలేకపోయారు. సినిమాలు, టీవీ షోలకే పరిమితమవుతూ హిందూపురం అభివృద్ధి గురించి ఏ మాత్రం బాలయ్య పట్టించుకోకపోవడంతో ఓటు వేసిన ప్రజలు, పార్టీ నాయకులు, కార్యకర్తల్లో తీవ్ర నిరుత్సాహం పొడచూపుతోంది.

పురం ప్రజల్లో కనుమరుగు..

'ఏదో ఇలా వచ్చా... చేతులు ఊపా.. వెళ్లా' అన్న తీరుగా మారింది హిందూపురం ఎమ్మెల్యే బాలయ్య తీరు. 2014లో ఎమ్మెల్యేగా గెలిచిన బాలయ్య.. టీడీపీ అధికారంలో ఉన్న ఐదేళ్లూ పట్టుమని పది సార్లు హిందూపురం వచ్చి వెళ్లారు. నియోజకవర్గాన్ని పూర్తిగా పీఏలకు అప్పగించేశారు. రెండోసారి 2019లో ఎన్నికైన తర్వాత అసలు తాను హిందూపురం ఎమ్మెల్యేననే సంగతి మరిచారు. ఈ క్రమంలో చుట్టపు చూపుగా వచ్చి వెళ్లే బాలయ్య క్రమంగా పురం ప్రజల మదిలో కనుమరుగవుతూ వచ్చారు.

శుభకార్యాలకు తప్ప..

తన సొంత వ్యాపకాలతో బిజీగా ఉండే ఎమ్మెల్యే బాలకృష్ణ... సొంత నియోజకవర్గంలో కాలు పెట్టాలంటే టీడీపీ ముఖ్య నేత ఇంట ఏదైనా శుభకార్యం జరగాలి. లేకపోతే హిందూపురం అనే నియోజకవర్గం ఒకటి ఉందనే విషయం కూడా ఆయనకు గుర్తుండదని టీడీపీ పెద్దలే అంటున్నారు. గత ఏడాది అక్టోబర్‌న తనకు అత్యంత సన్నిహితుడైన వ్యక్తి కుమారుడి వివాహ వేడుకకు హాజరయ్యారు. రెండో సారి ఎమ్మెల్యేగా ఎన్నికైన తర్వాత మూడు, నాలుగు సార్లు హిందూపురానికి బాలయ్య వచ్చి వెళ్లారు.

నియోజకవర్గ అభివృద్ధిలో కనిపించని పాత్ర..

సినిమాల్లో ఎలాంటి పాత్రనైనా రక్తికట్టించే బాలయ్య... నిజజీవితంలో ఎమ్మెల్యే పాత్రకు న్యాయం చేయలేకపోయారనే విమర్శను ఎదుర్కొవాల్సి వచ్చింది. 2014 నుంచి ఇప్పటి వరకూ ఈ ప్రాంత అభివృద్ధిలో ఎమ్మెల్యే బాలయ్య ముద్ర కనిపించకపోవడమే ఇందుకు కారణం. కనీసం అసెంబ్లీ సమావేశాలకు సైతం హాజరు కాకుండా ముఖం చాటేయడం పలు విమర్శలకు తావిస్తోంది. నియోజకవర్గ సమస్యలపై అసెంబ్లీలో ఏనాడూ ఆయన గళమిప్పలేదని ఆ పార్టీ నాయకులే పేర్కొంటుండడం గమనార్హం.

మాటలకు చేతలకు కుదరని పొంతన..

ఎమ్మెల్యే బాలయ్య ఏది చేసినా మాటలకు చేతలకు పొంతన ఉండదని నియోజకవర్గ ప్రజలు అంటున్నారు. గత ఏడాది జిల్లాల విభజన సమయంలో హిందూపురాన్ని జిల్లా కేంద్రంగా మార్చాలంటూ మౌనదీక్షతో హంగామా చేశారు. పుట్టపర్తిని జిల్లా కేంద్రంగా చేస్తే సహించేది లేదని, అవసరమైతే రాజీనామా చేస్తానంటూ ప్రగల్భాలు పలికారు. అయితే పుట్టపర్తిని జిల్లా కేంద్రంగా మార్చిన తర్వాత రాజీనామా అంశాన్ని అటకెక్కించేశారు.

26న రాక..

చుట్టపు చూపుగా హిందూపురానికి వచ్చి వెళ్లే ఎమ్మెల్యే బాలకృష్ణ... ఈ నెల 26న మరోసారి రానున్నారు. టీడీపీ ముఖ్య నాయకుడి ఇంట శుభకార్యానికి ఆయన హాజరు కానున్నట్లు సమాచారం. ఓ లెజెండ్‌గా కాకుండా ప్రజాప్రతినిధిగా హిందూపురంలో బాలయ్య ఎప్పుడు పర్యటిస్తారో వేచి చూడాలి.

క్లుప్తంగా

సబ్‌జైలును తనిఖీ చేసిన సీనియర్ సివిల్ జడ్జి



ఖైదీలతో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి గరికపాటి దీనబాబు

ధర్మవరం అర్బన్: స్థానిక సబ్‌జైలును సీనియర్ సివిల్ జడ్జి గరికపాటి దీనబాబు మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. పలు రికార్డులు, ఖైదీల గదులు, మౌలిక వసతులు పరిశీలించారు. అనంతరం ఖైదీలతో ముఖాముఖి మాట్లాడారు. సౌకర్యాలపై ఆరా తీశారు. క్షణికావేశంలో చేసిన తప్పులపై పశ్చాత్తాపం చెంది, విడుదలయ్యాక గ్రామాల్లో ప్రశాంతంగా జీవించాలని సూచించారు.

వినియోగదారులు ఇబ్బంది పడరాదు



మాట్లాడుతున్న రామ్మోహన్‌రావు

కదిరి టౌన్: విద్యుత్ వినియోగదారులు ఇబ్బంది పడకుండా సేవలు అందించాలని ఏపీఎస్‌పీడీసీఎల్ సీజీఆర్‌ఎఫ్ అధ్యక్షుడు కె.రామ్మోహన్‌రావు అన్నారు. మంగళవారం కదిరి ట్రాన్స్‌కో కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక విద్యుత్ అదాలత్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. కదిరి డివిజన్‌లో 25 మంది ఫిర్యాదుదారులు కలిసి వారి సమస్యలను వివరించారు. వాటికి సంబంధించిన విద్యుత్ ఏఈను పిలిపించి 15 రోజుల్లోపు సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో విద్యుత్ సాంకేతిక సభ్యులు ఎస్.ఎల్.అంజనీకుమార్, ఈఈ జె.మోసెస్, ఏడీఏ షాజహాన్ బాషా, ఏఈలు చెన్నకృష్ణ, శ్రీనివాసనాయక్, గౌరిశంకర్, సిబ్బంది పాల్గొన్నారు.

వ్యక్తి బలవన్మరణం

చిలమత్తూరు: అనారోగ్య పరిస్థితి తాళలేక ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... చిలమత్తూరు మండలం ముద్దప్పపల్లి నివాసి గంగాధరప్ప (46)కు భార్య, ఓ కుమార్తె, కుమారుడు ఉన్నారు. సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్న గంగాధరప్ప సోమవారం రాత్రి విధులకు వెళ్లాడు. మంగళవారం ఉదయం కోడూరు తోపులోని బీసీ కాలనీలో ఉన్న ఓ ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న కుటుంబసభ్యులు, పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతుడి కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

మట్కా బీటర్ల అరెస్ట్

- రూ.2,01,050 నగదు, ఏడు మొబైల్ ఫోన్లు స్వాధీనం



నిందితులను అరెస్ట్ చూపుతున్న పోలీసులు

మడకశిర: గుడిబండ మండలంలో మట్కా రాస్తున్న ఏడుగురు బీటర్లను పోలీసులు అరెస్ట్ చేశారు. వీరి నుంచి రూ.2,01,050 నగదు, ఏడు మొబైల్ ఫోన్లు, మట్కా పట్టీలు, బాల్‌పెన్నులు స్వాధీనం చేసుకున్నారు. మడకశిర సర్కిల్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితుల వివరాలను డీఎస్పీ హుస్సేన్ పీరా వెల్లడించారు. గుడిబండ మండలంలో కొన్ని నెలలుగా పెద్ద ఎత్తున మట్కా నిర్వహిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో పోలీసులు అప్రమత్తమై నిఘా పెంచారు. మంగళవారం ఉదయం కేఎన్‌పల్లిలో తనిఖీలు చేపట్టిన సమయంలో ఏడుగురు బీటర్లు పట్టుబడ్డారు. పట్టుబడిన వారిలో రాజ్‌కుమార్ అలియాస్ రాజు నుంచి రూ.1.30లక్షలు, నారాయణప్ప నుంచి రూ.9వేలు, తిప్పేస్వామి నుంచి రూ.18వేలు, గోవిందరాజు నుంచి రూ.17,500, నరసింహమూర్తి నుంచి రూ.9,700, గోవిందరాజులు నుంచి రూ.9,500, సిద్ధప్ప నుంచి రూ.7,300 చొప్పున స్వాధీనం చేసుకున్నారు. వీరిపై ఏపీ గ్యాంబ్లింగ్ యాక్ట్ కింద కేసు నమోదు చేశారు. బీటర్ల అరెస్ట్‌లో చొరవ చూపిన మడకశిర సీఐ సురేష్‌బాబు, గుడిబండ ఎస్‌ఐ మునిప్రతాప్, సిబ్బందిని డీఎస్పీ హుస్సేన్ పీరా అభినందించారు.

సవీరాలో నర్సు అనుమానాస్పద మృతి



పద్మ (ఫైల్)

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: నగరంలో ఓ యువతి అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. పోలీసులు తెలిపిన మేరకు.. నగర శివారులోని టమాట మండి వద్ద ఉన్న బీజేపీ కొట్టాలలో నివాసముంటున్న సునీత, కేశప్ప దంపతుల కుమార్తె పద్మ(23).. కిమ్స్ సవీరా ఆస్పత్రిలో స్టాఫ్ నర్సుగా పనిచేస్తోంది. సోమవారం రాత్రి విధులకు హాజరైన ఆమె మంగళవారం వేకువ జాము 2.22 గంటలకు ఎమర్జెన్సీ గదిలోని ఓ బెడ్‌పై నిద్రించింది. తెల్లవారుజాము 4.45 గంటలకు ఆమెను నిద్రలేపేందుకు తోటి ఉద్యోగి వెళ్లింది. ఆ సమయంలో అచేతనంగా పడి ఉన్న పద్మను గమనించి.. విషయాన్ని వెంటనే ఆస్పత్రి యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లింది. అప్రమత్తమైన వైద్యులు.. పరీక్షించి అప్పటికే ఆమె మృతి చెందినట్లు నిర్ధారించారు. విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు ఆస్పత్రికి వద్దకు చేరుకుని కుమార్తె మృతదేహాన్ని చూసి బోరున విలపించారు. ఎంతో ఆరోగ్యంగా ఉండే తమ బిడ్డ మృతి చెందిందంటే నమ్మశక్యంగా లేదని అనుమానం వ్యక్తం చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనపై అనుమానాస్పద మృతికింద కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు అనంతపురం నాల్గో పట్టణ పోలీసులు తెలిపారు. కాగా, విషయం తెలుసుకున్న ఎస్సీ, ఎస్టీ జేఏసీ నేతలు సాకే హరి, తదితరులు ఆస్పత్రి వద్దకు చేరుకుని పద్మ మృతదేహాన్ని పరిశీలించారు. ఆమె మృతికి కారకులెవరో తెలపాలంటూ ఆస్పత్రి వర్గాలను డిమాండ్ చేశారు. రెండు రోజుల క్రితం చిన్నారికి వైద్యం అందించే అంశంపై పద్మను యాజమాన్యం భయభ్రాంతులకు గురి చేసిందని, తప్పు లేకపోయినా లిఖిత పూర్వకంగా సంజాయిషీ తీసుకున్నారని మండిపడ్డారు. మరుసటి రోజు కూడా ఆమెను డైరెక్టర్ల సమావేశానికి రప్పించుకుని రాత్రి 9 గంటల వరకూ నిల్చోబెట్టి అవమానించారని మండిపడ్డారు. పద్మ మృతిపై లోతైన దర్యాప్తు చేపట్టి, బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆందోళన చేపట్టారు. ఆందోళనకారులను పోలీసులు అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు.

ద్విచక్ర వాహనం ఢీ.. వృద్ధుడి మృతి

తాడిపత్రి: ద్విచక్ర వాహనం ఢీకొన్న ఘటనలో ఓ వృద్ధుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... తాడిపత్రిలోని టాటా షోరూంలో వాచ్‌మెన్‌గా నందలపాడుకు చెందిన వరలక్ష్మయ్య.. మంగళవారం రాత్రి 10 గంటలకు విధులకు వెళుతుండగా షోరూం ఎదుట వేగంగా ద్విచక్రవాహనంపై దూసుకొచ్చిన ఓ బాలుడు ఢీకొన్నాడు. తీవ్రంగా గాయపడిన వరలక్ష్మయ్యను స్థానికులు వెంటనే తాడిపత్రి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే అతను మృతిచెందినట్లు నిర్ధారించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

పావగడకే వన్నె తెచ్చిన సూలగిత్తి నరసమ్మ



పరేడ్‌కు ఎంపికైన సూలగిత్తి నరసమ్మ శకటం

పావగడ: తాలూకాలోని కృష్ణాపురం గ్రామానికి చెందిన పద్మశ్రీ సూలగిత్తి నరసమ్మ పేరున కర్ణాటక ప్రభుత్వం రూపొందించిన శకటం న్యూఢిల్లీ వేదికగా జరిగే గణతంత్ర దినోత్సవ పరేడ్‌లో ప్రదర్శనకు ఎంపికైంది. దీంతో నరసమ్మ వల్ల దేశవ్యాప్తంగా పావగడకు ప్రత్యేక గుర్తింపు దక్కింది. ఇదే శకటంపై చిన్నారిని ఎత్తుకున్న విధంగా నరసమ్మ చిత్రంతో పాటు సాలుమరద తిమ్మక్క, తులసి గౌడ చిత్రాలూ ఉన్నాయి. సూలగిత్తి నరసమ్మ 30 గ్రామాలకు చెందిన పది వేల మంది గర్భిణులకు కాన్పు చేసి రికార్డు సృష్టించింది. తన 98వ ఏట ఆమె కన్నుమూసింది. రాష్ట్రపతి రామనాథ్ కోవింద్ చేతుల మీదుగా ఆమె పద్మశ్రీ అవార్డును అందుకున్నారు. అలాగే తుమకూరు యూనివర్సిటీ ఆమెకు గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది.

చేపల వేటకు వెళ్లి వృద్ధుడి మృతి



నారాయణ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే శంకరనారాయణ

రొద్దం: మండలంలోని గోనిమేకులపల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త నారాయణప్ప (62) ప్రమాదవశాత్తు నీటిలో పడి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే శంకరనారాయణ ఆ గ్రామానికి చేరుకుని మృతుడి కుటుంబసభ్యులను పరామర్శించారు. అలాగే నారనాగేపల్లిలో అనారోగ్యంతో ఆవుల చిన్న చిన్నపరెడ్డి (49) మృతి చెందిన విషయం తెలుసుకుని ఆ గ్రామానికి చేరుకుని మృతుడికి నివాళులర్పించారు. బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో ఎంపీపీ చంద్రశేఖర్, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ బి.నారాయణరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బోయ తిమ్మయ్య, సచివాలయాల సమన్వయకర్త రవిశేఖర్‌రెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు రాజగోపాలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యాచకురాలి మృతి

హిందూపురం: స్థానిక నేతాజీ నగర్‌లో గుర్తు తెలియని వృద్ధురాలు (55) మృతి చెందింది. మంగళవారం మృతదేహాన్ని పోలీసులు గుర్తించి ఆస్పత్రికి తరలించారు. కాగా, మృతురాలు హిందూపురంలోని ప్రధాన వీధుల్లో భిక్షమెత్తుకుని జీవించేదని, అనారోగ్యం కారణంగా ఆమె మృతిచెంది ఉంటుందని అనుమానాలు వ్యక్తమయ్యాయి. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

జాతీయస్థాయి పోటీలకు జిల్లా క్రీడాకారులు



ఎంపికైన క్రీడాకారులు

అనంతపురం సప్తగిరి సర్కిల్: జాతీయస్థాయి నెట్‌బాల్ పోటీలకు జిల్లాకు చెందిన పలువురు క్రీడాకారులు ఎంపికయ్యారు. ఎంపికైన వారిలో అరుణ, కళ్యాణి, సాయి, పావని, పూజిత, గోపినాథ్, షాహిద్ ఉన్నారు. వీరిని జిల్లా ఇన్‌చార్జ్ విద్యాశాఖాధికారి కృష్ణయ్య, జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి రవికుమార్, కో-ఆర్డినేటర్ నాగరాజు, పీడీలు నాగరాజు, వేణు, రమేష్, శివ, చంద్రశేఖర్ అభినందించారు.

పెన్నహోబిల క్షేత్రం పాలక మండలి ఏర్పాటుకు అనుమతులు జారీ

ఉరవకొండ రూరల్: ఉమ్మడి జిల్లాలో ప్రసిద్ధి గాంచిన పెన్నహోబిలం లక్ష్మీనరసింహస్వామి క్షేత్రం నూతన పాలక మండలి ఏర్పాటుకు హిందూ దేవాదాయశాఖ అనుమతులు జారీ చేసింది. ఈ నెల 22న అనుమతులు జారీ అయినట్లు ఆలయ ఈఓ కె.విజయ్‌కుమార్ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు ప్రకటన వెలువడిన రోజు నుంచి 20 రోజుల్లోపు దరఖాస్తులను కర్నూలులోని హిందూ దేవాదాయశాఖ ఉపకమిషనర్ కార్యాలయానికి పంపాలి.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

పెద్దవడుగూరు: మండలంలోని వీరేపల్లి సమీపంలో జాతీయ రహదారిపై గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. వివరాలు... మంగళవారం తెల్లవారుజామున వీరేపల్లి సమీపంలో రోడ్డు డివైడర్‌ను ఢీకొని ఓ ఆటో బోల్తాపడింది. ఘటనలో యాడికి మండలం ఓబుళాపురం గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ రాముడు తీవ్రంగా గాయపడ్డాడు. జాతీయ రహదారిపై పడి ఉన్న మృతదేహాన్ని గుర్తించి ఆటో డ్రైవర్ వాహనాన్ని పక్కకు మళ్లించడంతో డివైడర్‌ను ఢీకొన్నట్లు తెలుస్తోంది. క్షతగాత్రుడి నుంచి సమాచారం అందుకున్న పెద్దవడుగూరు ఎస్‌ఐ రాజశేఖరరెడ్డి, సిబ్బంది అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతుడి ముఖం గుర్తు పట్టలేనంతగా నుజ్జునుజ్జైంది. మృతుడి కుడిచేతిపై సుకన్య అనే పేరు పచ్చబొట్టు ఉంది. మృతుడి వివరాలు తెలిసిన వారు సంప్రదించాలని ఎస్‌ఐ (94407 96826) కోరారు.

పెద్దవడుగూరులో పర్యటించిన కేంద్ర బృందం

పెద్దవడుగూరు: కేంద్ర ప్రభుత్వ పథకాల అమలుపై పరిశీలన చేసేందుకు వచ్చిన కేంద్ర బృందం మంగళవారం పెద్దవడుగూరులో పర్యటించింది. తొలుత మహిళా సంఘాల సభ్యులతో స్థానిక అధికారులతో కలసి బృందం సభ్యులు ప్రదీప్‌పైక్రాయ్, సంతోష్‌ప్రధాన్ సమావేశమై, కేంద్ర ప్రభుత్వ పథకాల లబ్ధిపై ఆరా తీశారు. ఉపాధి పథకం ద్వారా చేపట్టిన పండ్ల తోటల పెంపకాన్ని పరిశీలించారు. రైతులకు బిల్లులు సకాలంలో అందుతున్నాయో.. లేదో అడిగి తెలుసుకున్నారు. బిల్లులు మంజూరైన రికార్డులు, గ్రామంలో నిర్మించిన సీసీ రోడ్లు, గృహాలను పరిశీలించారు. కార్యక్రమంలో సర్పంచ్ వరలక్ష్మి, జెడ్పీ సీఈఓ భాస్కరరెడ్డి, ఇన్‌చార్జ్ డీపీఓ సుమన జయంతి, ఎంపీడీఓ కుళ్లాయిస్వామి, ఈఓఆర్డీ నాగేశ్వరశాస్త్రి, ఏపీయం ఈశ్వరయ్య, ఏపీఓలు పుల్లారెడ్డి, జయరామిరెడ్డి, మండల పీఆర్ ఏఈ సురేష్‌రెడ్డి, శింగనమల పీఆర్ ఏఈ వరప్రసాద్, పంచాయతీ కార్యదర్శులు మురళీకృష్ణారెడ్డి, ప్రభాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లో టోకరా!

- పెట్రోల్ బంక్ రిటైల్ ఔట్‌లెట్ల ఏర్పాటు పేరుతో మోసం
- దరఖాస్తు పేరుతో రూ.1.25 లక్షలు చెల్లించిన బాధితులు
- సైబర్ నేరగాడి ఖాతాకు బదిలీ అయిన సొమ్ము



రాప్తాడు రూరల్: పెట్రో ఉత్పత్తుల రిటైల్ ఔట్‌లెట్ల ఏర్పాటు పేరుతో సైబర్ నేరగాళ్లు విసిరిన వలలో జిల్లాకు చెందిన ఇద్దరు చిక్కుకుని రూ.1.25 లక్షలు పోగొట్టుకున్నారు. పోలీసులు తెలిపిన మేరకు.. అనంతపురం రూరల్ పరిధిలోని విద్యారణ్యనగర్‌కు చెందిన సోదరులిద్దరు కురుగుంట, వడ్డుపల్లి ప్రాంతాల్లో పెట్రోల్ బంక్ ఔట్‌లెట్ ఏర్పాటు కోసం ఈ నెల 21న ఆన్‌లైన్‌లో ద్వారా దరఖాస్తు చేసుకున్నారు. petrolpumpksk. com వెబ్‌సైట్ తెరిచి వివరాలు పొందుపరిచి ఓకే బటన్ నొక్కారు. వెంటనే వచ్చిన యూపీఐపై క్లిక్ చేయగా క్యూఆర్ కోడ్ కనిపించింది. అక్కడ ఒక్కో దరఖాస్తుకు రూ.25వేలు చెల్లించాలని ఉండడంతో మొత్తం 5 దరఖాస్తులకు రూ.1.25 లక్షలు చెల్లించారు. అనంతరం ఇదే విషయాన్ని తమకు తెలిసిన వారికి వివరించడంతో దరఖాస్తు గడువు ముగిసిందని వారు తెలిపారు. దీంతో అనుమానం వచ్చి వెబ్‌సైట్ తెరిచి చూడగా మయాంక్‌జోషి అనే వ్యక్తి ఖాతాకు నగదు బదిలీ అయినట్లు కనిపించింది. దీంతో మయాంక్ జోషి నంబర్‌ను ఆరా తీయగా నోయిడాకు చెందినదిగా తేలింది. దీంతో తాము మోసపోయినట్లుగా గుర్తించిన బాధితులు వెంటనే ఆన్‌లైన్ ద్వారా పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనపై అనంతపురం రూరల్ సీఐ విజయభాస్కరగౌడ్ మాట్లాడుతూ.. పెట్రోల్ బంక్ రిటైల్ ఔట్‌లెట్ ఏర్పాటు చేయాలనుకునేవారు సంబంధిత అధికారులను ముందుగా సంప్రదించి, ఒరిజనల్ వెబ్‌సైట్ వివరాలు తీసుకుని దరఖాస్తు చేసుకోవాలన్నారు. లేకపోతే సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడే ప్రమాదముందన్నారు. ఎవరైనా మోసపోతే 1930 టోల్‌ఫ్రీ నంబరు లేదా cybercrime. gov. in ద్వారా ఫిర్యాదు చేయవచ్చునన్నారు. తాజా ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పేర్కొన్నారు.

హుండీ కానుకల లెక్కింపు

గుత్తి రూరల్: తొండపాడు గ్రామంలో బొలికొండ రంగనాథ స్వామి ఆలయ హుండీ కానుకల లెక్కింపు మంగళవారం నిర్వహించారు. స్వామి వారి ఆలయ ప్రాంగణంలో ఆరు నెలలా ఇరవై రోజులకు గాను రూ. 9,57,077 ఆదాయం వచ్చిందని ఈఓ దేవదాసు తెలిపారు. కార్యక్రమంలో అర్చకులు, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

జేసీ అనుచరులపై చర్యలకు డిమాండ్

తాడిపత్రి టౌన్: దళిత నాయకులపై దాడులకు తెగబడి, కిడ్నాప్‌కు ప్రయత్నించిన జేసీ అనుచరులపై కఠిన చర్యలు తీసుకోవాలంటూ ఎమ్మార్పీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు తాడిపత్రిలోని అంబేడ్కర్ సర్కిల్‌లో మంగళవారం నల్లబ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమానికి నేతృత్వం వహించిన ఎమ్మార్పీఎస్ నాయకుడు పెద్దిరాజు మాట్లాడుతూ... తాడిపత్రిలోని శ్రీనివాసపురం బైపాస్ రోడ్డు పక్కన ఉన్న ప్రభుత్వ స్థలంలో దండోరా కార్యాలయ నిర్మాణం చేపట్టిన ఎమ్మార్పీఎస్ నాయకులపై జేసీ అనుచరులు దాడి చేసి, కారులో బలంతంగా ఎక్కించుకుని వెళ్లేందుకు ప్రయత్నించారన్నారు. జేసీ అనునుచరుల దౌర్జన్యం, అరాచకాలు అరికట్టాలని, దళితులపై దాడికి పాల్పడిన వారిని తక్షణమే అరెస్టు చేయాలని, ఇలాంటి సంఘటన పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు బాల చంద్రుడు, నియోజకవర్గ ఇన్‌చార్జ్ సీబీ రవి, నాయకులు మనోహర్, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటుకు భూదానం

- 1.3 ఎకరాల భూమిని దానంగా ఇచ్చిన రైతు దంపతులు



తహసీల్దార్ రాముకు అంగీకార పత్రాన్ని అందజేస్తున్న రైతు దంపతులు రామాంజనేయులు, విజయలక్ష్మి (చిత్రంలో) సర్పంచ్ రమేష్‌రెడ్డి, గ్రామస్తులు

గుంతకల్లు రూరల్: రాష్ట్రాభివృద్ధి కోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రమిస్తున్న తీరు, ప్రజా సమస్యల పరిష్కారానికి గుంతకల్లు ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి (వైవీఆర్) చేస్తున్న కృషిని చూసి స్ఫూర్తి పొందిన రైతు దంపతులు.. తమ గ్రామంలో విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటుకు ఏకంగా 1.3 ఎకరాల పట్టా భూమిని ప్రభుత్వానికి స్వాధీనం చేశారు. రూ.కోట్లు ఆర్జించినా స్వలాభం కోసం పాకులాడే వ్యక్తులున్న నేటి సమాజంలో గ్రామాభివృద్ధి కోసం తమకున్న 4.5 ఎకరాల్లో రూ.15 లక్షలు విలువ చేసే 1.3 ఎకరాల భూమిని నయాపైసా ప్రతిఫలం ఆశించకుండా ప్రభుత్వానికి అందజేసిన నిరుపేద రైతు దంపతుల ఔదార్యాన్ని ఎమ్మెల్యే వైవీఆర్‌తో పాటు మండల ప్రజలు కొనియాడుతున్నారు.

లోఓల్టేజీ సమస్యతో ఇబ్బందులు..

25 గ్రామ పంచాయతీలు, 39 గ్రామాలున్న గుంతకల్లు మండలానికి కేవలం మూడు సబ్‌స్టేషన్ల నుంచి విద్యుత్ సరఫరా జరుగుతోంది. దీంతో లోఓల్టేజీ సమస్య తలెత్తి ఎన్నో ఏళ్లుగా రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతూ వచ్చారు. మోటర్లు తరచూ కాలిపోతుండటంతో పంట చేతికందక అవస్థలు పడుతున్న రైతులకు మోటర్ల మరమ్మతు అదనపు భారంగా మారింది. ఈ పరిస్థితిని అధిగమించేందుకు కొత్త విద్యుత్ సబ్ స్టేషన్ల ఏర్పాటుపై ఎమ్మెల్యే వైవీఆర్ దృష్టి సారించారు. గుంతకల్లు మండలంలోని ఓబుళాపురం, నెలగొండ, పామిడి మండలంలోని పాల్యం, గుత్తి మండలంలోని కరిడికొండ, గుంతకల్లు పట్టణంలోని సత్యనారాయణపేటలో కొత్తగా విద్యుత్ సబ్ స్టేషన్లు ఏర్పాటు చేయాలంటూ ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే చొరవతో తొలివిడతగా ఓబుళాపురం, పాళ్యం గ్రామాలకు నూతన సబ్ స్టేషన్లు మంజూరయ్యాయి.

భూదానానికి ముందుకు వచ్చిన రైతు దంపతులు..

నూతన సబ్‌స్టేషన్ మంజూరు కావడంతో ఓబుళాపురం, చుట్టుపక్కల పది గ్రామాల ప్రజల్లో హర్షం వ్యక్తమైంది. అయితే గ్రామంలోఅనువైన, అవసరమైన ప్రభుత్వ భూమి లేకపోవడంతో సబ్‌స్టేషన్ ఏర్పాటు ప్రశ్నార్థకంగా మారింది. ఈ పరిస్థితుల్లో అదే గ్రామానికి చెందిన రైతు వరికోటి రామాంజనేయులు, విజయలక్ష్మి దంపతులు 1.3 ఎకరాల భూమిని దానంగా ఇచ్చేందుకు ముందుకు వచ్చారు. ఈ మేరకు అంగీకార పత్రాన్ని మంగళవారం ఉదయం గ్రామ సర్పంచ్ రమేష్‌రెడ్డితో కలసి తహసీల్దార్ రాముకు అందజేశారు. ఈ సందర్భంగా రైతు దంపతులు మాట్లాడుతూ.. ఈ రోజు తాము ఆనందంగా ఉన్నామంటే అది జగన్ ప్రభుత్వం చలువేనన్నారు. నియోజకవర్గంలో ఎమ్మెల్యే చేపడుతున్న అభివృద్ధి పనులు చూసి స్ఫూర్తి పొంది ప్రజలకు మంచి జరగాలని ఆకాంక్షిస్తూ భూమిని ఉచితంగా అందజేసినట్లు వివరించారు. గ్రామ సర్పంచ్ రమేష్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటుకు అనువైన ప్రభుత్వ స్థలం గ్రామ పరిసరాల్లో ఎక్కడేగాని లేదన్నారు. ఇలాంటి తరుణంలో తన పేదరికాన్ని సైతం పక్కనబెట్టి గ్రామాభివృద్ధికి 1.3 ఎకరాల భూమిని ఉచితంగా అందజేసిన రైతు రామాంజనేయులు, విజయలక్ష్మి దంపతుల ఔదార్యాన్ని మాటల్లో వర్ణించలేమన్నారు.